ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

గురువారం 15 మే 2025



- రైల్వే బడ్జెట్ ప్రతులు విడుదల చేసిన కేంద్రం
- పలు పనులకు నిధులు కేటాయింపు
- పెద్దపల్లి- నిజామాబాద్ డబుల్ లైన్ సర్వేకు రూ. 3.56 కోట్లు

రామగుండం-మణుగూర్ లైన్‌కు రూ.2,911.11 కోట్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి భద్రాద్రి కొతగూడెం జిల్లా మణుగూర్ వరకు కోల్‌బెల్ట్ కారిడార్‌ను కలిపేం దుకు ప్రతిపాదించిన రామగుండం- మణుగూర్ రైల్వే లైన్‌కు కేంద్ర రైల్వే శాఖ 2,911.11 రూపాయలతో బడ్జెట్ అంచనాలను రూపొందించడం ఒక అడుగు ముందుకు పడినట్లు అ యింది. అంతేగాకుండా నిజామాబాద్ నుంచి పెద్దపల్లి లైన్‌లో సింగల్ లైన్‌లో నిర్మాణమైన బైపాస్ లైన్‌లో డబుల్ లైన్ నిర్మాణానికి కేంద్రం 36.99 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటవ తేదీన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 50 లక్షల 65 కోట్ల రూపాయలతో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. అందులో భాగంగా రైల్వే శాఖకు 2.65 లక్షల కోట్ల రూపాయలను కేటాయించింది. వాస్తవానికి ఐదేళ్ల క్రితం వరకు కేంద్ర బడ్జెట్‌లో భాగంగా అన్ని శాఖలకు కలిపి ఒక బడ్జెట్, రైల్వేశాఖకు సంబంధించి ప్రత్యేకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే వారు. కానీ గత నాలుగేళ్ల నుంచి రైల్వే శాఖ బడ్జెట్‌ను కూడా కేంద్ర బడ్జెట్‌లోనే కలిపి ప్రకటిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబం ధించి కేటాయించిన రైల్వే బడ్జెట్ ప్రతులను ఆ శాఖ మంగళవారం విడుదల చేసింది. అందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో గల కాజీపేట- బల్లార్షా, పెద్దపల్లి - నిజామాబాద్ లైన్‌లో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు.

● పెద్దపల్లి బైపాస్ లైన్‌కు రూ. 36.99 కోట్లు

నిజామాబాద్ నుంచి పెద్దపల్లి జంక్షన్ వరకు గల లైన్‌లో ప్యాసింజర్ రైళ్లు, గూడ్స్ రైళ్లు పెద్దపల్లి జంక్షన్‌కు వెళ్లకుండా నిర్మించిన పెద్దపల్లి బైపాస్ డబుల్ లైన్ నిర్మాణానికి 36 కోట్ల 99 లక్షల రూపాయల బడ్జెట్‌ను కేటాయించింది. సింగిల్ లైన్ ఇప్పటికే పూర్తి కాగా, ఇంకా ఈ లైన్ గుండా రైళ్లను అనుమితించ లేదు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం అవుతున్నది. ఈ లైన్‌లో డబుల్ లైన్ ఆవశ్యకతను గుర్తించిన రైల్వే శాఖ డబుల్ లైన్ (2.169 కిలోమీటర్లు) కోసం నిధులు కేటాయించింది. దీంతో నిజామాబాద్ లైన్ గుండా కాజీపేట, వరంగల్ లైన్ల మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్యాసింజర్, గూడ్స్ రైళ్లు పెద్దపల్లి జంక్షన్ మీదుగా వెళ్లాల్సిన అవసరం లేకుండా పోనున్నది. ఈ లైన్ లేకుంటే ప్రతి రైలుకు 45 నిమిషాల నుంచి గంటకు పైగా సమయం పడుతున్నది. ఈ లైన్‌తో ఆ ఇబ్బందులు తీరనున్నాయి. అలాగే జిల్లా లోని పొత్కపల్లి- కొల నూర్ మధ్యలో ఎల్‌సీ నంబర్ 33 (ఎం) 307/14-16 కిలో మీటర్ల మధ్యలో అండర్ బ్రిడ్జి నిర్మాణానికి 7 కోట్ల 41 లక్షల రూపాయలు మంజూరు చేశారు. కొలనూర్- పెద్దపల్లి మార్గంలో ఎల్‌సి నంబర్ 37 (ఎం) కిలో మీటర్ 299 వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి 7 కోట్ల 66 లక్షల రూపాయలు మంజూరు చేశారు. నిజామాబాద్- పెద్దపల్లి లైన్‌లో సుల్తానా బాద్ వద్ద గల యార్డు అప్‌గ్రేడేషన్ క్నోం 36 కోట్ల 80 లక్షలు, పెద్దపల్లిలో గూడ్స్ విస్తరణ కోసం 9.99 కోట్లు మంజూరు చేశారు. పెద్దపల్లి, రామగుండం, మంచి ర్యాల రైల్వే స్టేషన్లలో అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరణ పనులు చేపట్టారు. అదనపు పనులకు 16 కోట్ల 98 లక్షల నిధులను కేటాయించారు. పెద్దపల్లి నుంచి నిజామాబాద్ వరకు గల 178 కిలోమీటర్ల రైల్వే లైన్‌లో డబుల్ లైన్ నిర్మాణానికి సర్వే కోసం 3 కోట్ల 56 లక్షల రూపాయలను కేటాయించారు. రామ గుండం రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ పోస్టు భవన నిర్మాణానికి సంబంధించి అదనంగా 2 కోట్ల 51 లక్షల రూపాయలను కేటాయించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో రైల్వే ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

● కోల్ కారిడార్ అనుసంధాన రైల్వే లైన్

రెండు దశాబ్దాల కాలంగా ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో విస్తరించి ఉన్న కోల్ కారిడార్‌ను అనుసంధానం చేసేందుకు వీలుగా రామగుండం నుంచి మణుగూర్ వరకు 200 కిలోమీటర్ల దూరం వరకు రైల్వే లైన్ నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ లైన్ కోసం పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వివేక్ కృషి చేశారు. పలుసార్లు ఈ లైన్ గురించి సర్వేలు నిర్వహించిన రైల్వే శాఖ ఈ లైన్ నిర్మించడం సబబుగా భావించింది. ఆ మేరకు గత ఏడాది భూసేకరణ కోసం సంబంధిత రెవెన్యూ శాఖాధికరులకు ఆదేశాలు జారీ చేసింది. లైన్ నిర్మాణానికి కావాల్సిన అంచనాలను రైల్వే శాఖ రూపొందించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో 2,911.11 కోట్ల రూపాయలు వ్యయం అవుతాయని అంచనా వేసింది. ఆ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. త్వరలోనే ఈ లైన్ నిర్మా ణానికి టెండర్లు ప్రకటించే అవకాశాలున్నాయి.

ఒకే దేశం.. ఒకే ఎన్నికపై అవగాహన

కళ్యాణ్‌నగర్, మే 14(ఆంధ్ర జ్యోతి): ఒకే దేశం... ఒకే ఎన్నిక నిర్వహించాలని, వన్ నేషన్, వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ సోమారపు లావణ్య అన్నారు. గోదావరిఖని ఇందిరానగర్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకే సారి దేశ వ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించడం వల్ల సమయంతో పాటు తక్కువ ఖర్చుతో ఎన్నికలు నిర్వహించవచ్చన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజగోపాల్, సుల్వ లక్ష్మీనర్సయ్య, పెద్దపల్లి రవీందర్, మహవాది రామన్న, కాసిపేట శివాజీ, చంద్రశేఖర్, నవీన్, కిషన్‌రావు, కిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోమారపు లావణ్య

వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): గతం కంటే ఎన్నో రెట్లు వేగవం తంగా రైతుల పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా వడ్ల కొనుగోలు జరుగుతుందని, రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. జిల్లాలో యాసంగి మార్కెటింగ్ సీజన్ 2022-23 మే 13 నాటికి 11 వేల 26 మంది రైతుల నుంచి 88 వేల 930 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2023-24లో 28 వేల 427 మంది మంది రైతుల నుంచి 2 లక్షల 11 వేల 449 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 72 శాతం చెల్లింపులు చేయగా ఈ ఏడాది 29 వేల 206 మంది రైతుల నుంచి 2 లక్షల 18 వేల 392 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి 82శాతం చెల్లింపులు పూర్తి చేశామన్నారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకుని వస్తే వెంటనే కొనుగోలు చేస్తున్నామని, నాణ్యత ప్రమాణాలను పరీక్షించి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులను అనవసర ఆందోళనకు గురి చేయ వద్దని, ప్రభుత్వం చివరి గింజ వరకు ప్రతి రైతు వద్ద నుంచి ధాన్యం సేక రించి మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని కలెక్టర్ తెలిపారు.

పుష్కరాల ఉత్సవ కమిటీ మెంబర్ల నియామకం

మంథని, మే 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కాళేశ్వరంలో జరుతున్న సరస్వతీ నది పుష్కరాల ఉత్సవ కమిటీ మెంబర్‌గా మంథనికి చెందిన అవధానుల మోహన్‌శర్మను నియమించారు. కాళేశ్వరం దేవస్థానంలో మోహన్‌శర్మ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. నేటి నుంచి కాళేశ్వరంలో జరిగే సరస్వతీ నది పుష్కరాల ఉత్సవాల నిర్వాహణ కోసం 14 మందిని మెంబర్స్‌గా, ప్రత్యేక ఆహ్వానితులుగా మరో నలుగురిని నామినేట్ చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మోహన్‌శర్మ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



మోహన్‌శర్మ



కాటం సత్యం

● రామగిరి: సరస్వతి పుష్కరాలను పురస్కరించుకొని మండలంలోని సెంటినరీకాలనీ కాంగ్రెస్ పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు కాటం సత్యం కాళే శ్వర ఉత్సవ కమిటీ సభ్యుడిగా నియామకం అయ్యారు. ఈ మేరకు ఐటి శా ఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. తన నియామ కానికి సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

కాల్వశ్రీరాంపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామ పరిధిలో మోడల్ స్కూల్‌లోని జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవ త్సరం ప్రవేశాలు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పోచయ్య తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ప్రతి గ్రూప్‌లో 40సీట్లు ఉన్నాయన్నారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదివే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం ఉంటుందని అన్నారు. జూన్ రెండు నుంచి క్లాసులు ప్రారంభమ వుతాయన్నారు. ఈ నెల 26న దరఖాస్తులు పరిశీలించి 27వ తేదీ నుంచి 31వరకు విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించడం జరుగుతుందన్నారు.

తహసీల్దార్ ఎదుట ఇద్దరి బైండోవర్

ధర్మారం, మే 14 (ఆంధ్రజ్యోతి): గుండుబా తయారు చేసి విక్రయిస్తున్న ధర్మారం చెందిన ఇద్దరు వ్యక్తులను తహసీల్దార్ ఎండీ వకీల్ ఎదుట బైండో వర్ చేశారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం ఉదయం ధర్మారం గ్రామంలో ఎక్సైజ్ ఎస్సై జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో గుడుంబా అనుమానిత ఇళ్ల లో దాడులు చేసి ఇద్దరు వ్యక్తుల నుంచి 3.7 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. బుధవారం ఇద్దరిని ధర్మారం తహశీల్దార్ ఎండీ వకీల్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్‌ఐ జీవన్‌రెడ్డి తెలిపారు. వారి వెంట ఈసి వనిత, కానిస్టేబుల్స్ శరత్, కృష్ణ ఉన్నారు.

రైతులకు అండగా ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, మే 14 ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఎల్లవేళలా రైతులకు అండగా ఉంటారని మాజీ ఎంపీపీ గోప గోని సారయ్య గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానమబ్బులు వచ్చి పోతూ అప్పడప్పుడు వర్షాలు పడుతూ రైతులను భయపెడుతున్నాయని, దీంతో అక్కడక్కడ కొంత వరిధాన్యం తడిసి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నాన్నారు. వరిధాన్యం తడిసినా రైతులు అధైర్య పడవద్దని గింజ కటింగ్ లేకుండా ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టితో కాంటాలు పెట్టించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బంగారు రమేష్, ఎండి.మునీర్, శివరామకృష్ణ, మార్కెట్ డైరెక్టర్ ధాన్యగెటి రాంచందర్, కానుగంటి రాంచందర్ తదితరలు పాల్గొన్నారు.



ధాన్యంను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

● హక్కుల సాధనకు 20న సమ్మె

● హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు

సుల్తానాబాద్ మే 14 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 20న నిర్వహించ నున్న దేశవ్యాప్త సమ్మెలో హమాలీ కార్మికులు పాల్గొనాలని హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యంరావు పిలుపునిచ్చారు. బుధవారం సుల్తానా బాద్ మండలంలోని సుద్దాల, సుగ్లాం పల్లి, గర్రెపల్లి గోడౌన్ల హమాలీ కార్మికులకు కరపత్రాలు పంచుతూ గ్రూపు సమా వేశాలు చేస్తూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మే 20న దేశవ్యాప్త సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీ యూ) జిల్లా అధ్యక్షులు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, హమాలీ కార్మికులందరికీ గుర్తిం పు కార్డులు ఇవ్వాలని, విధి నిర్వహణలో గాయపడి న, చనిపోయిన కార్మికులకు నష్టపరి హారం ఇచ్చే విధంగా ఇన్సూ రెన్స్ చేయించాలని, 55 సంవత్సరాల నిండిన ప్రతి హమాలీ కార్మికునికి నెలకు 9 వేల పెన్షన్ ఇవ్వాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నామన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం సమ్మె చేపట్టినట్లు తెలి పారు. ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల హమాలీ కార్మిక యూనియన్ల నాయకు లు పోగుల తిరుపతి, రాజమల్లు, ప్రసా ద్, సమ్మయ్య, నరసయ్య, శంకర్, తిరు పతి, రాజయ్య,, మల్లయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమం అందరి బాధ్యత

● కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) గ్రామ పంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్లుగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమం మనందరి బాధ్యతగా భావించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో యూనిసెఫ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల భద్రత రక్షణ గౌరవం అంశంపై ఎంపీడీవోలకు , సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, జిల్లాలోని గ్రామాలలో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్ లైన పారిశుధ్య కార్మికులకు తప్పనిసరిగా ప్రమాద బీమా గ్రామ పంచాయతీ నిధుల నుంచి ప్రీమియం చెల్లించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంజేజేబివై, పీఎంఎస్‌బివై పోస్టల్ వినియోగించుకొని బీమా తప్పనిసరిగా చేయించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు రెగ్యులర్‌గా సమీపంలోనే ఆరోగ్య కేంద్రంలో అవసరమైన హెల్త్ చెకప్ చేయించాలని, అవసరమైన వారికి వైద్య చికిత్స అందించాలన్నారు. గ్రామాలలో ఇంటి వద్దనే తడి చెత్త పొడి చెత్త వేరు వేరుగా సేకరించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో చెత్తను ఇంటి వద్దనే వేరువేరు చేయుట, తడి చెత్తతో ఎరువుల తయారీ, ఆదాయం ఎలా సమీక రించుకోవాలన్న అంశాలను కలెక్టర్ వివరించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహ ణపై ప్రత్యేక దృష్టిసారించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణకు కార్యాచరణ సిద్ధం చేయాలని, డిసెంబర్ నాటికి జిల్లాలో ఎక్కడ గ్రామాలలో ప్లాస్టిక్ ఉండ టానికి వీలులేదని, రోడ్లపై ఎక్కడ ప్లాస్టిక్, చెత్త కనపడవద్దన్నారు. అనంతరం పారిశుద్ధ కార్మికులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ సమావేశంలో యూని సెఫ్ శిక్షకులు కిషన్ స్వామి , ఫణీంద్ర, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చ య్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, జడ్పీ సీఈఓ నరేందర్, స్వచ్ఛ భారత్ మిషన్ మేనేజర్ రాఘవులు, ఎంపీడీవోలు మండల పంచాయతీ అధికారులు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులతో కలెక్టర్, అధికారులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

● జిల్లా విద్యాధికారి మాధవి

సుల్తానాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలని ఆయా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుకో వాలని జిల్లా విద్యాధికారి మాధవి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఉపాధ్యా యుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారి డి.మాధవి బుధవారం సందర్శించారు.. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని, విద్యార్థుల సంఖ్యను పెంచేవిధంగా బడి బాటలో ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొనా లని ఉపాధ్యాయులను కోరారు. కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్‌లో నేర్చుకున్న అంశాలను సృజనాత్మక కృత్యాలుగా రూపొందించుకొని విద్యార్థుల్లో ఆంగ్లం సామర్థ్యాలు పెంపొందించాలని, ఆంగ్లంలో వెనుక బడ్డ విద్యార్థులను పాఠశాల ప్రారంభంలో గుర్తించి గ్రూపుల వారీగా అభ్యాసం చేయిం చాలని సూచించారు. రికార్డు మెయింటెయిన్ చేయాలని , తరగతి గదిలో నేర్చుకొనే వాతావ రణాన్ని కల్పించడం ఉపాధ్యాయుల భాధ్యత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కరీంనగర్ జిల్లా విద్యా కళాశాల ప్రిన్సిపాల్ మొండయ్య, సెంటర్ అబ్జర్వర్ సీహెచ్ ప్రద్యుమ్న కుమార్ ఆకస్మి కంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులతో శిక్షణ అంశాల గురించి ఉపాధ్యాయులతో అనుభవా లను పంచుకున్నారు. శిక్షణతో నూతనమైన, సృజ నాత్మకమైన విద్యా ప్రణాళికలు రూపొందించుకొని అభ్యసన ఫలితాలు సాధించేలా బోధన చేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. యోగా మాస్టర్ రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులకు యోగా యొక్క ప్రాముఖ్యత తెలియజేసి, పాఠశాలల్లో అమలుచేయాలని తెలిపారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ఎంఈవో ఆరేపల్లి రాజయ్య, రిసోర్స్‌పర్సన్లు గడ్డం జగదీశ్వర్, జైడ శ్రీనివాస్, డింగరి నాగరాజు, కడవేరు శ్రీనివాస్, ఉపాధ్యాయులు సీఆర్పీలు రామ చంద్రం సదానందం, ఎంఐఎస్ ప్రియాంక ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో మాధవి

బస్సులు లేక ఇబ్బందులు

- రాత్రి 8గంటలు దాటితే కరీంనగర్, భూపాలపల్లికి గగనమే
- రద్దీకి అనుగుణంగా నడవని బస్సులు

కళ్యాణ్‌నగర్, మే 14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నా దానికి అనుగుణంగా బస్సు సర్వీసులను నడపడంలో ఆర్‌టీసీ అధికారులు విఫలమవుతున్నారు. రాత్రి 8గంటలు దాటితే బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలంటూ ప్రయాణికులు పలు మార్లు గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్‌కు మొర పెట్టుకున్నారు. అయినా బస్సుల సంఖ్య పెరగడం లేదు. ప్రధానంగా రాత్రి 8గంటలు దాటితే కరీంనగర్, భూపాలపల్లి ఏరియాలకు బస్సులు ఉండడం లేదు. కరీంనగర్ నుంచి కూడా రాత్రి 8గంటలు దాటితే బస్సులు ఉండడం లేదు. హైదరాబాద్ నుంచి వచ్చే బస్సు సర్వీసుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. కోల్‌బెల్ట్ ప్రాంతమైన భూపాలపల్లి నుంచి కూడా రాత్రి 8గంటలు దాటితే బస్సులు ఉండడం లేదు. చివరి బస్సు పరకాల నుంచి బెల్లంపల్లి వరకు ఉండడంతో ఆ బస్సు ప్రయాణికులతో కిక్కిరిసి పోతుంది. భూపాలపల్లి నుంచి బస్సు సౌకర్యం పెంచాలని అక్కడి డీఎంకు ప్రయాణికులు చాలాసార్లు మొర పెట్టుకున్నారు. రామగుండం ప్రాంతం నుంచి రోజూ కార్మికులు భూపాలపల్లిలో విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా బస్సుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 18కిలో మీటర్ల దూరంలో ఉన్న మంచిర్యాలకు కూడా రాత్రి వేళల్లో బస్సు సర్వీసులు అందుబాటులో ఉండడం లేదు. మందమర్రి, బెల్లంపల్లి, గోలేటి సింగరేణి గనులకు కూడా ఇక్కడి నుంచి కార్మికులు విధులకు హాజరవుతుంటారు. కార్మికులు డ్యూటీ సమయాల్లో తమకు స్పెషల్ బస్సులను ఏర్పాటు చేయాలని నిత్యం కోరుతున్నారు. ఆసిఫాబాద్‌కు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సులు తప్ప విధుల సమయంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో ఉండడం లేదని, తాము విధులకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఫైటింక్లయిన్‌కాలనీ వయా కమాన్‌పూర్ నుంచి రాత్రి వేళల్లో హైదరాబాద్‌కు బస్సు సర్వీసులను పెంచాలని పలుమార్లు ప్రయాణికులు విజ్ఞప్తి చేసినా ఆ రూట్లలో ఇప్పటి వరకు బస్సుల సంఖ్యను పెంచడం లేదు. రాత్రి సమయంలో బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు ఎన్నిసార్లు డయల్ యువర్ డీఎం, వినతిపత్రం ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు.



బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

రాత్రి ప్రయాణానికి తిప్పలు

- మార్కపురి సూర్య, గోదావరిఖని

కరీంనగర్ నుంచి గోదావరిఖనికి రావాలన్నా, ఇక్కడి నుంచి కరీంనగర్‌కు వెళ్లాలన్నా రాత్రి ఎనిమిది గంటలు దాటితే బస్సులు ఉండడం లేదు. హైదరాబాద్ నుంచి వచ్చే బస్సులే దిక్కవుతున్నాయి. బస్సుల కోసం బస్టాండ్‌లో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. ఆర్‌ఎం చొరవ తీసుకుని బస్సుల సంఖ్య పెంచాలి.



రాచర్లగొల్లపల్లిలో యువతి బలవన్మరణం


అంజలి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు అనారోగ్యం.. మరోవైపు కుటుంబ పరిస్థితిని తట్టుకోలేక మనస్తాపం చెందిన యువతి ముద్రకోల అంజలి(18) ఉరివేసుకొని బలవన్మరణానికి ఒడిగట్టింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని నాగమణి-శంకర్ దంపతుల చిన్న కూతురు అంజలి ఇంటర్‌వరకు చదువుకుని ఇంటి వద్ద ఉంటోంది. కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతోంది. పలు ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. వైద్యానికి తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను చూసి మనస్తాపం చెంది ఇంట్లో అంజలి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతురాలికి తల్లిదండ్రులు నాగమణి, శంకర్, సోదరి, సోదరుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


ప్రశాంత్(ఫైల్)

వీణవంక, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రేపాల ప్రశాంత్(27) పురుగులమందు తాగి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రశాంత్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక సమస్యలతోపాటు అప్పులు కావడంతో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తిచెంది సోమవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రశాంత్ తల్లి సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ప్రొబేషనరీ ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి


మృతిచెందిన రామశంకర్

జమ్మికుంట రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామసమీ పంలో రామశంకర్(45) అనేవ్యక్తి బుధవారం ప్రమాదవశాత్తు సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైల్లో నుంచి కిందపడి మృతిచెందాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సోన్భద్ర జిల్లా పిపరి గ్రామానికిచెందిన రామశంకర్ కూలీపని కోసం చెన్నై వెళ్లేందుకు మీర్జాపూర్ రైల్వేస్టేషన్‌లో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. అతడితోపాటు గ్రామస్థులు మోహన్, విజయ్‌కుమార్ రైల్లో ప్రయాణిస్తున్నారు. మార్గమధ్యలో సైదాపూర్ గ్రామ సమీపంలో రామశంకర్ ప్రమాదవశాత్తు రైల్లో నుంచి కిందపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మల్యాల, మే 14 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం తాటిపల్లిలో నందెల్లి లక్ష్మారెడ్డి అనే రైతుకు చెందిన గేదె తెగిపడిన విద్యుత్ తీగలను తాకి విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందింది. గేదె విలువ రూ.70వేల వరకు ఉంటుందని నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరాడు.



అతివలకు ధీమా..

ఇందిరా మహిళా శక్తి బీమా

స్వయం సహాయక సభ్యులకు ప్రయోజనం

ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 10 లక్షలు

అంగవైకల్యం పొందితే రూ. 5 లక్షలు



చొప్పదండి, మే 14 (ఆంధ్రజ్యోతి): అతివల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వాలు రుణాలను అందిస్తున్నాయి. సంఘాల ఏర్పాటు ద్వారా సభ్యులు రుణాలను పొందుతూ స్వశక్తితో ఎదుగుతున్నారు. సంఘాల్లోని మహిళలకు మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మహిళకు బీమా సౌకర్యం కల్పించాలని ఇందిరా మహిళా శక్తి పథకాన్ని తీసుకువచ్చింది. సంఘాల్లో సభ్యురాలిగా ఉండి స్త్రీనిధి ద్వారా రుణం తీసుకున్న మహిళ అనివార్య కారణాల వల్ల మరణిస్తే రెండు లక్షల లోపు రుణాన్ని ప్రభుత్వమే చెల్లించేది. తాజాగా ప్రభుత్వం ఈ విధానాన్ని బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్నవారికి కూడా వర్తింపజేసేలా చేసింది.

● అనేక మందికి ప్రయోజనం...

మండలంలో 842 సంఘాలలో 8,560 మంది సభ్యులు ఉన్నారు. అర్హత కలిగిన ప్రతి మహిళ స్వయం సహాయ సంఘాల్లో చేరాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించి ప్రోత్సహిస్తుంది. సంఘం సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకుని చిరు వ్యాపారాలు చేసుకోవడానికి బ్యాంకు లింకేజీతో స్త్రీ నిధి, మహిళా శక్తి పథకాల ద్వారా వివిధ రకాల రుణాలను అందజేస్తున్నారు.

● అవగాహన అవసరం...

ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ రెండు పథకాల్లో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్ని గ్రూపుల వారు నెలవారీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన వివరాలు నిధి పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి.



● రుణ బీమా రూ. 2 లక్షలు...

ఒక్కో సంఘానికి 5 లక్షల నుంచి 20 లక్షల వరకు రుణాలు అందిస్తున్నారు. రుణం పొందిన మహిళల్లో ఎవరైనా మరణిస్తే వడ్డీతో కలిపి ఆమె కుటుంబ సభ్యులు చెల్లించాల్సి వచ్చేది. అలా చెల్లించకపోతే ఆ ప్రభావం గ్రూపు సభ్యులపై పడేది. ప్రస్తుతం పొదుపు మహిళలకు ప్రభుత్వం రెండు లక్షల వరకు రుణ బీమా వర్తింపజేసింది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణం పొందిన మహిళ చనిపోతే ఆమె కట్టాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం మాఫీ చేస్తుంది.

● 18 నుంచి 60 ఏళ్ల వయస్సు వారికి...

పొదుపు సంఘాల మహిళలు మృతి చెందితే వారి కుటుంబాలకు 10 లక్షల ఉచిత బీమా వర్తింపజేస్తున్నారు. వందశాతం వైకల్యం కలిగినా 10 లక్షలు అందిస్తారు. 50 శాతం వైకల్యం కలిగితే ఐదు లక్షలు చెల్లిస్తారు. మృతి చెందిన మహిళ రుణం తీసుకుంటే మాఫీ చేస్తారు. గాయాలైన మహిళ అంగ వైకల్యం చెందితే సదరం ధ్రువపత్రాలు, చికిత్స పొందిన ఆసుపత్రి పత్రాలు సమర్పించాలి. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సున్న పొదుపు మహిళలకు ఇది వర్తిస్తుంది.

● మహిళలకు ప్రయోజనకరం

నర్మద, ఐకేపీ ఏపీఎం, చొప్పదండి



సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు బీమా సౌకర్యం ఎంతో ప్రయోజనకరంగా ఉంది. బీమా పై మహిళా సంఘ సభ్యులందరికి అవగాహన కల్పిస్తున్నాం.



తాళం వేసిన ఇంట్లో చోరీ

ఎల్లారెడ్డిపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో తాళంవేసి ఉన్న పెద్దవేని శ్రీనివాస్ ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం చోరీకి పాల్పడ్డారని పోలీసులు, బాధితులు తెలిపారు. శ్రీనివాస్ ఇంటికి తాళంవేసి బయటకు వెళ్లాడని పేర్కొన్నారు. తిరిగి ఇంటికి చేరుకునేసరికి వేసిన తాళం పగిలిపోయి కనిపించిందని చెప్పారు. ఇంటిలోని బీరువా ధ్వంసం చేసి ఇతర వస్తువులు చిందరవందరగా పడేశారని పేర్కొన్నారు. రూ1.50 లక్షల విలువైన బంగారు వెండి ఆభరణాలతో పాటు టీవీని ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు పేర్కొన్నారు.

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరణ

జమ్మికుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన ఇంజమూరి వెంకటలక్ష్మి (85) మెడలోని బంగారు గొలుసును బుధవారం గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. వివరాల్లోకి వెళితే.. వెంకటలక్ష్మి ఇంటి బయట ఉండగా గుర్తు తెలియని వ్యక్తి తాత ఉన్నాడా అమ్మా.. అంటూ దగ్గరకు వచ్చాడు. ఇంతలోనే ఒక్కసారిగా మెడలోని బంగారు గొలుసు ఎత్తుకెళ్లాడు. బంగారు గొలుసు విలువ రూ.35వేలు ఉంటుందని వృద్ధురాలు పేర్కొంది. వెంకటలక్ష్మి కుమారుడు వెంకట సత్యనారాయణస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తులపై కేసు

సారంగాపూర్, మే, 14 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదుచేసి వారి వాహనాలను ఎక్సైజ్ పోలీసులు సీజ్‌చేశారు. ఎక్సైజ్‌సీఐ సర్వేశ్వర్ తెలిపినవివరాల మేరకు ముగ్గురు వ్యక్తులు తమద్విచక్ర వాహనాలపై 12 లీటర్లనాటుసారాను తరలిస్తున్న క్రమంలో పట్టుకున్నామన్నారు. వీరిలో మద్దులపల్లికి చెందిన జరుపుల రాజునాయక్, బానోత్‌డాలు నాయక్‌లపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఐస్వప్న, రాజేందర్, సిబ్బంది, అబ్దుల్ల, కిషోర్, రమేష్, సంతోష్‌కిరణ్, దేవేందర్, మహేందర్‌లు పాల్గొన్నారు. వారిని పెగడపల్లి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

వడదెబ్బతో రైతు మృతి


నర్సయ్య (ఫైల్)

వెల్గటూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని జగదేవ్‌పేట గ్రామానికి చెందిన బచ్చల నర్సయ్య(46) అనే రైతు మంగళవారం వడదెబ్బతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు నర్సయ్య రెండురోజులు ఎండలో వ్యవ సాయ పనులకు వెళ్లి వడదెబ్బ తగిలి అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నర్సయ్య మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వర్షంతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తాం

● రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా జిల్లాలో నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలలో తడిసిపోయిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం పూర్తి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని మంత్రి తెలిపారు. అకాల వర్షాల కారణంగా జిల్లాలో దెబ్బతిన్నపంట వివరాలను సేకరించి రైతులకు చెల్లించాల్సిన నష్ట పరిహారంపై నివేదిక అందించాలని మంత్రి వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు ఆదేశాలు జారీ చేశా రు. అకాల వర్షాల కారణంగా ఏ రైతు నష్టపోకుండా ప్రభుత్వం తమ వంతు సహకారం అందిస్తుందని రైతులు ఎటువంటి ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని మంత్రి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పీడీఎస్ సన్నబియ్యం పట్టివేత


ధర్మారంలో పట్టుకున్న పీడీఎస్ బియ్యం లారీ

ధర్మారం, మే 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నుంచి లారీలో తరలిస్తున్న పీడీఎస్ సన్న బియ్యాన్ని సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. మంచిర్యాల నుంచి అక్రమంగా పీడీఎస్ సన్న బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందింది. సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ ఫోర్స్ టీం ఇంచార్జ్ ఓఎస్డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో ధర్మారంలో వాహనాల తనిఖీ చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున తనిఖీ చేస్తున్న అధికారులు అక్రమంగా రేషన్ బియ్యాన్ని లోడ్ చేసుకొని వెళ్తున్న లారీని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. పంచనామా నిర్వహించిన అనంతరం లారీని లోడ్ చేసిన వ్యక్తులతో పాటు దాన్ని తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిని చాకచక్యంగా పట్టుకున్న ఓఎస్డీ ప్రభాకర్, ఎస్ఓటీ లక్ష్మారెడ్డి, ఎస్సై జంగయ్య, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ బాల్‌సింగ్, శ్రీనివాసులను ఎస్పీ శశిధర్ రాజు టాస్క్‌ఫోర్స్ కమీషనర్ డి.ఎస్.చౌహాన్ అభినందించారు.

గంజాయి పట్టివేత

● ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ గోదాంగడ్డ ప్రాంతంలో కరీంనగర్ అర్బన్‌ఎక్సైజ్ పోలీసులు బుధవారం 425గ్రాముల నిషేధిత గంజాయిని పట్టుకున్నారు. అర్బన్ ఎక్సైజ్‌సీఐ జి రాము వివరాల ప్రకారం.. గోదాంగడ్డ ప్రాంతానికి చెందిన తమ్మడి పృథ్వీరాజ్ అనే యువకుడు ఎండు గంజాయిని రవాణా చేస్తుండగా కరీంనగర్‌లో వాహనాల తనిఖీల్లో పట్టుకున్నారు. అదుపులోకి తీసుకొని విచారించగా పృథ్వీరాజ్ విశాఖపట్నంలో గంజాయిని కొనగోలు చేస్తున్నట్లు, కరీంనగర్‌కు తీసుకొచ్చి స్థానిక యువకులకు విక్రయిస్తున్నట్లు తేలింది. బైక్‌ను, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్‌సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్‌ఎస్సై ఎండీ ఇషాక్‌పాషా, హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్‌రెడ్డి, కానిస్టేబుళ్ల మహేష్, జగన్, రాము, శంకర్ ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు


గ్రామస్థులు, ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులతో మాట్లాడుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమరవాణా చేపడితే చర్యలు తీసుకుంటామని కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ప్రజలు, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ గతంలో ట్రాక్టర్లద్వారా ఇసుక అక్రమరవాణా చేసి కేసులు నమోదైన చేగుర్తి, దుర్శేడ్ గ్రామాలకు చెందిన తొమ్మిది మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు, లక్షరూపాయల పూచీకత్తు చెల్లించినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి ఉన్న క్వారీల నుంచి ఇళ్లు, ఇతరత్రా నిర్మాణాలకు ఇసుకను కొనుగోలు చేయాలని సూచించారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుకను కొనుగోలు చేయవద్దన్నారు. కార్యక్రమంలో కరీంనగర్‌రూరల్ ఎస్ఐ లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత..

వీణవంక, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లిగ్రామంలోని మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణాచేస్తున్న రెండు ఇసుకట్రాక్టర్లను పట్టుకున్నట్టు ప్రొబేషనరీ ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్నా చెవులసంపత్, వేల్పుల కనకరాజుపై కేసునమోదు చేసినట్టు తెలిపారు.

ఇసుక డంప్ సీజ్..

బీర్‌పూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంప్‌లను తహసీల్దార్ ముంతాజ్‌బుద్దీన్ సీజ్‌చేశారు. బీర్‌పూర్ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో అక్రమంగా ఇసుక డంపు ఏర్పాటు చేశారని అందిన సమాచారం మేరకు బుధవారం తహసీల్దార్ తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంపును గుర్తించి సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

వడ్ల కుప్పలకు ఢీకొని ఒకరి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు

గంభీరావుపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో రోడ్లపై ఆరబోసిన వడ్లకుప్పలకు ఢీకొని ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. మల్లారెడ్డిపేట గ్రామసమీపంలో ఈఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన ఖలీల్, శేఖర్ అనే ఇద్దరు మోటర్‌సైకిల్‌పై లింగన్నపేటవెళ్లి తిరిగి మల్లారెడ్డిపేట వస్తున్నారు. మల్లారెడ్డిపేట గ్రామ సమీపాన రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పలకు ఢీకొట్టి ఎగిరి పడటంతో వీరికి తీవ్రగాయాలు అయ్యాయి. 108లో మెరుగైనచికిత్స కోసం ఇద్దరిని తీసుకెళుతుండగా మార్గమధ్యలో ఖలీల్(45) మృతిచెందాడు. తీవ్రగాయాలపాలైన శేఖర్‌ను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్సకోసం తరలించారు. బాధిత కుటుంబాల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ ప్రేమానందం తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


మణెమ్మ(ఫైల్)

మానకొండూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చునూర్ గ్రామంలో ఈనెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మణెమ్మ(47) మంగళవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామానికి చెందిన కొమ్మిడి మణెమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. భర్త సమ్మిరెడ్డి ఈ నెల 10న ఆమెను మోటార్‌సైకిల్‌పై కరీంనగర్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లి తిరిగి రాత్రి వస్తున్నారు. మండలంలోని పచ్చునూర్‌లో రోడ్డుపై పోసిన వరిధాన్యంపై కుప్పపై మోటార్‌సైకిల్ ఎక్కి అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో తీవ్రగాయాలపాలైన మణెమ్మను 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త సమ్మిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రూ.7500 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7500 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు ఏడుగురు రైతులు 70క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠధర రూ.7500, కనిష్ఠధర రూ.7300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో
శాంతి చర్చలు జరపాలి

● పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నక్క నారాయణరావు



మహాసభలో పాల్గొన్న పౌర హక్కుల సంఘం నాయకులు

కరీంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నక్క నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని ఫిల్మ్ భవన్‌లో ఉమ్మడి జిల్లా ఐదో మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఓపెన్ కాస్ట్‌ల విధ్వంసానికి, ఇటుక బట్టీల్లో ఒరిస్సా కార్మికుల శ్రమ దోపిడికి వ్యతిరేకంగా ఉమ్మడి పౌర హక్కుల సంఘం జిల్లాకమిటీ పోరాటాలు నిర్వహించిందన్నారు. పౌరహక్కుల సంఘం నాయకుల అక్రమ హత్యలు మొదలు రేచపల్లిలో పోగుల రాజేశంను అక్రమంగా అరెస్టుచేసి బెయిల్ ఇవ్వకుండా హింసించినట్లు ఆరోపించారు. అనంతరం పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు అటవీ, ఖనిజసంపదను కట్టబెట్టడానికి ఎంఓయూలను కుదుర్చుకుందని, ఆదివాసీలను వారికి మద్దతుగా ఉన్న మావోయిస్టులను చంపుతోందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పెసా చట్టాన్ని, రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూల్‌లను, అటవీహక్కుల చట్టం గ్రామసభ తీర్మానాలను అమలు చేయాలన్నారు. ఛత్తీస్‌గడ్‌లో ఉన్న సైనిక క్యాంపులను, కరీంనగర్ జిల్లా కోశాధికారి పోగుల రాజేశంపై ఉన్న కేసును ఎత్తివేయాలన్నారు. అంతకుముందు పౌరహక్కులసంఘం మహాసభలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఉమ్మడిజిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, జర్నలిస్ట్ వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమారస్వామి, రైతుసంఘం నాయకులు ముడిమడుగుల మల్లన్న, వరంగల్ పౌరహక్కుల సంఘం జిల్లాఅధ్యక్షుడు రమేష్‌చందర్, ప్రధాన కార్యదర్శి పాణి, బొడ్డుపల్లి రవి, నారా వినోద్, నక్క సత్యనారాయణ, బొంకూరి లక్ష్మణ్, పుల్ల సుచరిత, బండారి రాజలింగు, రెడ్డిరాజుల సంపత్, సీనియర్ ప్రజాసంఘాల నాయకులు మహమ్మద్ హుస్సేన్, మార్వాడి సుదర్శన్, విరసం కరీంనగర్ జిల్లాకన్వీనర్ బాలసాని రాజయ్య, గుమ్మడి కొమురయ్య, శాంతక్క, రామిళ్ల బాపు, అంగిడి కుమార్, కుతాడి శివకుమార్, వెల్లొండ పద్మ, జిన్నాం, ప్రసాద్, ఇరుగురాల ఆనందం, భీమ్, బోయినపల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

ఎలిగేడు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరెళ్ల ప్రవళ్లిక(25)అనే వివాహిత అదనపుకట్నం వేధింపులు తాళలేక ఈనెల11న క్రిమిసంహారకమందు తాత్మహత్యాయత్నం చేసింది. మంగళవారం రాత్రి మృతిచెందినట్లు జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సిరిసిల్ల మండలం పెద్దూర్ గ్రామానికిచెందిన మద్దికుంట ప్రశాంత్ (29), ప్రవళ్లికతో 2023లో వివాహంకాగా కొన్ని రోజులు సజావుగా కాపురం చేశారు. తర్వాత భర్త ప్రశాంత్, అత్త శశికళ, మామ రామచంద్ర, ఆడపడుచులు దీప్తి, వాణి అదనపు కట్నం కోసం వేధించారు. ఇరవై రోజుల క్రితం స్వగ్రామం ముప్పిరితోటకు వచ్చింది. ఈనెల 11న క్రిమిసంహారక మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బావిలో దూకి మహిళ బలవన్మరణం

కోనరావుపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికిచెందిన సాసాల లక్ష్మి(50) భర్త అంజయ్యతోపాటు కుటుంబ సభ్యులు గంభీరావుపేటలో తల్లిగారి ఇంట్లో ఉన్న చిన్నకోడలు సీమంతానికి బుధవారం వెళ్లారు. లక్ష్మికి రెండుసార్లు కిడ్నీలో ఉన్న రాళ్ల కోసం ఆపరేషన్ చేశారు. లక్ష్మిని మంగళపల్లిలోని ఇంటివద్దనేఉంచి చిన్న కోడలు సీమంతానికి కుటుంబ సభ్యులు వెళ్లారు. కాగా, లక్ష్మి మల్లారం మూలవాగులో ఉన్న తమ సొంత బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మంగళపల్లి గ్రామానికి చెందిన జీవరత్నం మృతదేహాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతురాలికి భర్త అంజయ్య, కుమారులు మహేష్, బ్రహ్మానందం, కూతురు జ్యోతి ఉన్నారు.

అంగన్‌వాడీలో నాసిరకం కోడిగుడ్లు సరఫరా

● ఉడికించిన గుడ్డు రంగు మారి దుర్వాసన

కోరుట్ల రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలో నాసిరకం కోడిగుడ్లు రావడంతో కిశోరబాలలు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోరుట్ల మండలం చిన్న మెట్‌పల్లి గ్రామంలో బుధవారం గర్భిణులకు పంపిణీ చేసిన కోడిగుడ్లను ఉడికించగా వాటి నుంచి దుర్వాసన వచ్చింది. దీంతో పలువురు గ్రామస్థులు అంగన్‌వాడీటీచర్ల దృష్టికి తీసుకపోయారు. ఆమె విషయాన్ని ఐసీడీఎస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్డు నాసిరకంగా ఉండడంతో పలు విమర్శలకు తావిస్తున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతుల కల్పనకు కృషి

టీఎస్ఎంఎస్ ఐడీసీ ఎండీ ఫణిందర్‌రెడ్డి



క్రిటికల్ కేర్ యూనిట్ ఆసుపత్రి నమూనాను పరిశీలిస్తున్న ఫణిందర్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రధానాసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఫణిందర్‌రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్మాణం పూర్తి అయిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిటికల్ కేర్ యూనిట్‌కు అవసరమైన యంత్ర సామాగ్రి, పనిముట్లను త్వరలో సమకూర్చు తామని అన్నారు. 50 గదుల క్రిటికల్ కేర్ యూనిట్ ప్రస్తుతం జగిత్యాల జిల్లాకు కేటాయించామని అవసరాన్ని బట్టి దానిని మరింత పెంచేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ యూనిట్, ఐసీయూ, స్టెరిలైజేషన్ యూనిట్, డ్రెసింగ్ రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసు పత్రిలో రోగులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను తప్పని సరిగా ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం క్రిటికల్ కేర్ యూనిట్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మెడిసిన్ స్టాక్ యూనిట్‌ను పరిశీలించారు. మందులు అన్ని ఒక క్రమ పద్ధతిలో పేర్చి లేకపోవడంతో ఇలా అయితే ఇలా మీకైనా కావాల్సిన మందులు దొరుకుతాయా అని ఇంచార్జి అనూజ్ కుమార్‌ను ప్రశ్నించారు.

మెడికల్ కళాశాలలో వసతులు కల్పించాలని వినతి..

క్రిటికల్ కేర్ యూనిట్‌ను పరిశీలించిన అనంతరం తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఫణిందర్‌రెడ్డిని జగిత్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ ఖాద్రీ కలిసి వసతులు కల్పించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఆయనను మెడికల్ కళాశాలకు ఆహ్వానించారు. కళాశాలలోని ల్యాబ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల నిర్మాణం త్వరలో పూర్తి అయ్యేలా ప్రభుత్వంతో చర్చించి నిధుల విడుదలకు కృషి చేస్తానని ఫణిందర్‌రెడ్డి తెలిపారు.

కలిసి ఉంటే కలదు సుఖం



- నేడు అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం
- విచ్ఛిన్నమవుతున్న ఉమ్మడి కుటుంబాలు

కరీంనగర్ కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిలో కుటుంబ వ్యవస్థకు చాలా ప్రాముఖ్యత ఉంది. అందులోనూ ఉమ్మడి కుటుంబం మన సంప్రదాయాలకు, నాగరికతకు అద్దంపడుతుంది. ప్రేమానురాగాలు, ఆత్మీయతకు బీజం పడేది కుటుంబ వ్యవస్థలోనే. గతంలో ఉమ్మడి కుటుంబాలకు ప్రత్యే క గుర్తింపు ఉండేది. ఒక ఇంట్లో ఎంత మంది కొడుకులు, బిడ్డలు ఉన్నా తల్లిదండ్రులతో కలసిమెలసి ఉం టూ కష్ట సుఖాల్లో పాలుపంచుకునేవారు.

ఆడవారు అత్తారింటికి వెళ్లినా మిగిలిన వారందరూ ఒకే గొడుగు కింద ఉండేవారు. కొడుకులు, మనుమలు, మనుమరాళ్లు ఇలా రెండు మూడు తరాల వారు ఆనందంగా జీవించేవారు. ప్రస్తుత కాలంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛినం అవుతుండడంతో మానవ సంబం ధాలు దెబ్బతింటున్నాయి. పిల్లలు బంధుత్వాలకు, ప్రేమానురాగాలు, ఆప్యాయతలకు దూరమవుతున్నారు. కుటుంబ వ్యక్తుల్లో కలహాలు, అంతరాలు, ఈర్ష్యా అసూయ, నూతన పోకడలు, విలాసవంతమైన జీవితాలు గడపాలనే ఆలోచన, చిన్న విషయానికే తప్పు పట్టుకోవడం, అస్తి అంతస్తులు వంటి కారణాలు ఉమ్మడి కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయి. మనుషులు, మనసుల మధ్య అంతరాలు దూరాన్ని పెంచుతున్నాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరు గవుతుండడంతో ఒక సందర్భంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా వయస్సు పైబడి న వారికి అవస్థలు తప్పడం లేదు. తప్పని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులను వదిలి అనాథాశ్రమాలకు వెళ్తున్నారు.

ఒక కుటుంబం విచ్ఛిన్నమైతే ఆ ప్రాంతం, సమాజం కూడా దెబ్బతింటుంది. ముఖ్యంగా దీని ప్రభావం రాబోయే తరానికి చెందిన పిల్లలపై పడుతోంది. ప్రేమలు, ఐక్యత, అనురాగాలు, అవగాహన కుటుంబ సౌధానికి స్తంభాలుగా శ్రీరామరక్షగా నిలుస్తాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా కుటుంబ సభ్యులు అందరూ సంకుచిత తత్వాన్ని వీడి విశాల ధృక్పథాన్ని కలిగి ఉండాలి. సర్దుబాటుతో వ్యవహరిస్తే ఆ కుటుంబం చింత లేని రాజుగారి కుటుంబంలా వర్ధిల్లుతుంది.

ఉద్దేశం

కుటుంబ వ్యవస్థను పటిష్ఠంగా ఉంచడం, కుటుంబాల ద్వారా సమాజానికి అందించే సానుకూల ప్రభావాన్ని హైలెట్ చేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం.



● కుటుంబ దినోత్సవ నేపథ్యం

అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఏటా నిర్వహించుకోవాలని 1993 మే 15న ఐక్యరాజ్య సమితి తీర్మానించింది. ఈ రోజును కుటుంబ వ్యవస్థ, ప్రాముఖ్యత, కుటుంబాల సామాజిక ఆర్థిక సాంస్కృతిక పాత్రను గుర్తించేందుకు కేటాయించారు. కుటుంబ దినోత్సవం రోజున ఐక్యరాజ్య సమితి ఏటా ఒక థీమ్‌ను ప్రకటిస్తోంది. ఈ ఏడాది 'కుటుంబ ఆధారిత విధానాలు-స్థిరమైన అభివృద్ధి'ని అంశంగా నిర్ణయించారు.

● ప్రయోజనాలు

ఉమ్మడి కుటుంబాల మధ్య సంబంధాలు బలోపేతం అవుతాయి. సమాజంలో కుటుంబాల అవసరంపై అవగాహన పెరుగుతుంది. బాధ్యతలు, ఇంటి పనులు, కుటుంబ సభ్యుల మధ్య పంచుకుంటారు. వ్యక్తిగత ఒత్తిడి తగ్గుతుంది. పని భారాన్ని సమానంగా పంపిణీ చేస్తుంది. వృద్ధులకు అవసరమైన వారికి మద్దతు అందిస్తుంది. భావోద్వేగ బంధాన్ని ఏర్పరుస్తుంది. ఐక్యతను పెంచుతుంది. సంప్రదాయ విలువలు భావితరాలకు అందుతాయి. సమాజంలో సముచితమైన గుర్తింపు లభిస్తుంది.

సరస్వతీ పుష్కరాల్లో ఆర్టీసీ సిబ్బందికి వైద్యశిబిరం

భగత్‌నగర్, మే 14(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాల్లో విధి నిర్వహణలో ఉండే ఆర్టీసీ సిబ్బంది కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కరీంనగర్ జోనల్ హాస్పిటల్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏవీ గిరిసింహారావు ప్రకటనలో తెలిపారు. కాళేశ్వరంలోని ప్రత్యేక ప్రయాణ ప్రాంగణంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు వైద్య శిబిరం కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు,అవసరమైన మందులు, వైద్య సిబ్బంది, అంబులెన్స్ సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కరీంనగర్ జోన్‌లో ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం రీజియన్‌లలోని ఆర్టీసీ ఉద్యోగులందరూ వినియోగించుకునే సదుపాయం ఉందని వివరించారు.

17న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆగమ్‌రావు, ఎస్.మురళీధర్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ కేంద్రాల్లో ఉదయం 8 నుంచి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆరు జట్లను ఎంపికచేసి రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిన పోటీలను నిర్వహిస్తామని, ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీల ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఎంపికైన జట్లు జూన్‌లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించనున్న అంతర్‌జిల్లా క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. 17 నుంచి 27 సంవత్సరాల వయస్సు లోపు వారు అర్హులని, ఆసక్తిగల క్రీడాకారులు పదోతరగతి సర్టిఫికెట్, మీసేవ నుంచి పొందిన జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్ కేంద్రంవారు కోచ్ శ్రవణ్ కుమార్, వేములవాడ కేంద్రంవారు కోచ్ పి.రాజు, జగిత్యాల కేంద్రంవారు కోచ్ డి.జలపతి, గోదావరిఖని కేంద్రంవారు కోచ్ డి. కిరణ్‌కుమార్‌కు దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

రాజన్న ఖజానాకు రూ.1.65 కోట్లు

204 గ్రాముల బంగారం, 13 కిలోల వెండి



హుండీలను లెక్కిస్తున్న రాజరాజేశ్వర సేవ సమితి సభ్యులు

వేములవాడ కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేమలవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ ఖజానాకు రూ.కోటి 65 లక్షల నగదు సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి బుధవారం వెల్లడించారు. రాజన్న ఆలయ 20 రోజుల హుండీలను అత్యంత భద్రత మధ్య లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయానికి రూ.కోటి 65 లక్షల 607 నగదుతోపాటు 204 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం, 13 కిలోల 200 గ్రామల వెండి సమకూరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, కరీనంగర్ సహాయ కమిషనర్ కార్యాలయ అధికారి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



రాజన్న హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు

విజయవాడ కనకదుర్గమ్మకు అగ్గిపెట్టెలో చీర

సిరిసిల్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నేత కళాకారుడు నల్ల విజయ్ నేసిన అగ్గిపెట్టెలో పట్టు చీరను బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ కనకదుర్గమ్మ అమ్మ వారికి అందించారు. దేవస్థానం ఈవో సీనానాయక్ అందించగా దేవస్థానం ప్రాంగణంలో ఆవిష్కరించారు. త్వరలోనే రిఫ్లెక్షన్ సారీ పేరుతో పట్టుచీర నేసే సందర్భంగా అమ్మ వారి ఆశీస్సుల కోసం వచ్చానని విజయ్ తెలిపారు.



విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం ఈవోకు అగ్గిపెట్టె చీరను అందిస్తున్న విజయ్

సమన్వయంతో హనుమాన్ జయంతి ఏర్పాట్లు చేపట్టాలి

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, మే 14 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 20 నుంచి మూడు రోజుల పాటు జరిగే పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను భక్తులకు ఎలాటి అసౌకర్యం కలుగకుండా సమన్వయంతో ఏర్పాట్లు చూపట్టాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొండగట్టులో బుధవారం కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుధ్యం, నీటిసౌకర్యం, విద్యుత్ తదితర ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. శాఖల వారీగా చేపడుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం కొండపైన ఆలయ పరిసరాలు, దీక్ష విరమణ మండపం పరిశీలించారు. త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకు ముందు ఆంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఈవో శ్రీకాంత్‌రావు, ఆర్డీవో మధుసూధన్, డీఎస్పీ రఘుచరన్, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జగిత్యాల కలెక్టర్, ఎస్పీ



శిక్షణకు హాజరైన కానిస్టేబుళ్లు

నూతన కానిస్టేబుళ్లకు టెక్నాలజీపై శిక్షణ

కరీంనగర్ క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో కొత్తగా నియామకమైన కానిస్టేబుళ్లకు టెక్నాలజీ వినియోగంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీస్ ట్రైనింగ్‌లో అందించిన శిక్షణతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి టెక్నాలజీపై పట్టు సాధించేలా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కమిషనరేట్ కేంద్రంలోని ఐటీ కోర్ కార్యాలయంలో పోలీసులు వినియోగించే వివిధ సాఫ్ట్‌వేర్‌లు, అప్లికేషన్‌లు, ఇతర సాంకేతిక పరిజ్ఞానంపై ఈ శిక్షణ కొనసాగుతుందని వివరించారు. ఐటీ కోర్ కార్యాలయ సీఐ జె.సరిలాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం

టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్‌కు సన్మానం



పొన్నం అశోక్ గౌడ్‌ను సన్మానిస్తున్న లింగంపల్లి నాగరాజు, కరీంనగర్ బార్ అసోసియేషన్

కరీంనగర్ లీగల్, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్‌ను కరీంనగర్ బార్ అసోసియేషన్ తరుపున ఘనంగా సన్మానించారు. బుధవారం ఆయన జిల్లా కోర్టుకు వచ్చారు. ఆయనను బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లింగంపల్లి నాగరాజు సాదరంగా ఆయనను ఆహ్వానించి శాలువా కప్పి సన్మానించారు. నాగురాజును పొన్నం అశోక్ గౌడ్ శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పొన్నం అశోక్‌గౌడ్ మాట్లాడుతూ తను మొదట న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన కోర్టుకు చాలా రోజుల తర్వాత రావడం, తన పాత మిత్రులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆయన జిల్లా జడ్జి శివకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ బాధ్యులు భూక్యా రజనీష్, ఆర్ దేవేందర్‌రెడ్డి, రాచకొండ ప్రభాకర్, పంజాల కుమార స్వామి,శంకర్, సృజన్ కుమార్, సీనియర్ న్యాయవాదులు పిన్నింటి అశోక్, కూర శ్రీనివాస్ రెడ్డి, మంచికట్ల రాజేశం, సిహెచ్ విక్రమ్‌కుమార్, పెరుక రాజన్న, కె యాదగిరి, వేణుగోపాల్, రమేశ్ పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ బోనాల జాతర



బోనాలతో వెళ్తున్న మహిళలు

కోనరావుపేట, మే 14 (ఆంధ్రజ్యోతి):కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో నల్ల పోచమ్మ బోనాల జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి బోనంతో పోతురాజుల ఆటపాటలతో డప్పుచప్పుళ్ల మధ్య నల్ల పోచమ్మ తల్లి ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యుత్ శాఖ అధికారులకు అవార్డులు



ఎస్‌ఈ రమేష్ బాబును అభినందిస్తున్న తెలంగాణ పవర్ ఇంజనీర్ అసోసియేషన్ సభ్యులు

గణేశ్‌నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలోని ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక పోటీ తత్వాన్ని పెంచి వివిధ పారామీటర్లలో అందజేసే అవార్డులకు ఉమ్మడి జిల్లా స్థాయిలో అధికారులను బుధవారం ఎంపిక చేశారు. బెస్ట్ పర్ఫార్మెన్స్ ఆఫ్ ది మంత్ పేరిట అందజేసే అవార్డులకు ఎస్ఈ స్థాయిలో ఎం.రమేష్‌బాబు కరీంనగర్ డిస్కమ్ స్థాయి 1వ ర్యాంక్, డీఈల స్థాయిలో జె.రాజం డీఈ కరీంనగర్ డిస్కమ్ స్థాయి 2వ ర్యాంక్, ఎస్.లక్ష్మారెడ్డి డీఈ హుజూరాబాద్ డిస్కమ్ స్థాయి 3వ ర్యాంక్ అవార్డులకు ఎంపికయ్యారు. సర్కిల్ స్థాయిలో ఎం.తిరుపతి డీఈ రూరల్ కరీంనగర్‌కు మొదటి ర్యాంక్, అదేవిధంగా వివిధ స్థాయిల్లో ఏడీఈ ఎం. లావణ్య, పి.శ్రీనివాస్, జి.శ్రీనివాసులు, ఏఈలు రజిత, రఘు, రామ్మోహన్, శ్రీనివాస్, మల్లయ్య, నాయక్, భూమయ్య, సంపత్‌రెడ్డి అవార్డులకు ఎంపికయ్యారు. ప్రతీనెల ఉత్తమ పనితీరు అవార్డులు అందజేస్తున్నట్లు, ఏప్రిల్‌కు సంబంధించి ఎంపిక చేసినట్లు సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు.

కళలను, కళాకారులను ప్రోత్సహించాలి

కరీంనగర్ కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): కళలను, కళాకారులను ప్రోత్సహించాలని, అప్పుడే సంస్కృతీ సంప్రదాయాల విలువలు భావి తరాలకు అందుతాయని, ఇతర దేశాల మెప్పును పొందుతాయని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. కళాభారతిలో భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమి, టీవీ, చలనచిత్ర, నాటక రంగ అభివృద్ధి సంస్థ సంయుక్త సౌజన్యంతో మన సమైక్యత కల్చరల్ అకాడమి సారథ్యంలో నిర్వహిస్తున్న పౌరాణిక పద్య నాటక ప్రదర్శన బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. పూర్వం నాటకాలకు ఎంతో ప్రాచుర్యం ఉండేదని, ప్రస్తుతం ప్రభావం కోల్పోతున్నాయని అన్నారు. కళయే పరమావధిగా, జీవనోపాధిగా బతుకుతున్న కొన్ని సంస్థలు ఉన్నాయన్నారు. వాటికి పునర్ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు.

అనంతరం హైదరాబాద్‌కు చెందిన నృత్య కళాకా రిణి పురాణం మాధవి మాట్లాడుతూ తాను సురభి కళాకారులపై పరిశోధన చేస్తున్నట్లు చెప్పారు. నాటకాల మాధు ర్యాన్ని తెలిపేం దుకు సురభి వారి నాటకాలను జిల్లా వాసులకు చూపించే ప్రయ త్నం చేసిన అకాడమి అధ్యక్షుడు రొడ్డ యాదగిరి అభినందనీ యులన్నారు. అనంతరం 'బాలనాగమ్మ' నాటకం మంత్ర ముగ్ధుల్ని చేసింది. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సువార్త, డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, మెతుకు సత్యం, పీఎస్ రవీంద్ర, జి.కృపా దానం, సంస్థ ప్రధాన కార్యదర్శి ఆగస్టీన్, సభ్యురాలు సూర్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.





కళాభారతిలో నాటక ప్రదర్శన, తిలకిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అధికారులు, ప్రజలు

పారదర్శకంగా యువ వికాసం అర్హుల జాబితా ఎంపిక

-కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికా సం పథకం క్రింద స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు అర్హులైన దరఖాస్తుల వివరాలను బ్యాంకర్లు వెంటనే సంబంధిత ఎంపీడీఓలకు అందజేయాలని కలెక్టర్ సూచించారు.బ్యాంకర్లు అందించిన జాబితాను ఎంపిడిఓ పరిశీలించి గత ఐదు సంవత్సరాలలో కార్పొరేషన్ ద్వారా ఇతర రుణాలు, యూనిట్లు ఏమైనా పొందు ఉన్నారా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉందో పరిశీలించి తుది అర్హుల జాబితాను పారదర్శకంగా ఎంపిక చేసి ఎమ్మెల్యేలకు త్వరితగతిన రిపోర్ట్ అందించాలని కలెక్టర్ సూచించారు.

● మహిళా సంఘాల ద్వారా వృద్ధాశ్రమం నిర్వహణ

మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా పెద్దపల్లి జిల్లాలో వృద్ధాశ్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో వృద్ధాశ్రమం నిర్వహణ అవగాహన ఒప్పందం కుదుర్చుకునే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు పొదుపు తదితర విషయాలే కాకుండా సామాజిక సేవకు ముందుకు రావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం 70 లక్షల రూపాయల ఖర్చుతో వృద్ధాశ్రమాన్ని నిర్మించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం


మడకలో విద్యుత్ తీగలు తెగిపడి మృతి చెందిన మేకలు


జలమయమైన కల్యాణ్‌నగర్ రోడ్డు

కళ్యాణ్‌నగర్, మే 14(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి అకస్మాత్తుగా గాలివాన బీభత్సం సృష్టించింది. భారీగా ఉరుములు, మెరుపులతో పిడుగులు పడ్డాయి. దీంతో రోడ్లన్నీ జలమయం కాగా అక్కడక్కడ చెట్లు విరిగి పడ్డాయి. 2.5సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. ప్రధానంగా లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, అడ్డగుంటపల్లి, తిలక్‌నగర్, బస్టాండ్ కాలనీ, గాంధీనగర్‌లలో రోడ్లు జలమయం కాగా ప్రధాన కాలువలు పొంగిపొర్లాయి. ఇటీవల కొత్త కూరగాయల మార్కెట్‌లో ఉన్న హోల్‌సేల్ మార్కెట్‌ను జూనియర్ కళాశాల మైదానంలోకి తరలించగా వర్షంతో మార్కెట్ చిత్తడిగా మారింది.

● **సుల్తానాబాద్:** అర్ధరాత్రి కురిసిన వర్షానికి మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసి పోయింది. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రీనగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో పెద్ద ఎత్తున ధాన్యం నిలువ ఉంది. సమీపంలోని ఆరేపల్లి గ్రామంలో కూడా కొనుగోళ్లు జరుగుతున్నాయి. అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఉరిస్తే రవీందర్ అనే రైతు ధాన్యం. వరదలో కొట్టుకుపోయింది. పూసాలలో ధాన్యం తడిసి పోయింది.

● **ఓదెల:** గాలివాన విలయతాండవం.. మరో ప్రక్క విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నిరుపేద కుటుంబానికి కోలుకోలేని నష్టం జరిగింది. మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి ఉధృతంగా వీచిన గాలి అకాల వర్షంతో మడకలో విద్యుత్ తీగలు తెగిపడి వేల్పుల రాజకొమురయ్యకు చెందిన 25 మేకలు,గొర్రెలు మృతి చెందాయి. విద్యుత్ తీగలు తెగి కంచెపై పడడంతో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. దాదాపు 3.50 లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాజీ జడ్పీటీసీ గంట రాములు,సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం బుధవారం పరామర్శించారు.మడకలో నష్టపోయిన రాజకొంరయ్య కుటుంబానికి మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ ఐదువేయిల రూపాయల ఆర్థికసాయం అందజేశారు.

పొత్కపల్లిలో అమ్మకానికి సిద్దంగా ఉన్న వరి ధాన్యం వర్షానికి తడసి ముద్దయింది.సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం,మండల కార్యదర్శి కోడేం స్వామి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.వారు మాట్లాడుతూ తడసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను కోరారు.

● **ఎలిగేడు:** మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకొని అమ్మేందుకు సిద్ధమవుతున్న సమయంలో విధి వర్షం రూపంలో వచ్చి తడిసిపోవడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోళ్లు పూర్తిచేయాలని కోరుతున్నారు.


సుల్తాన్‌పూర్‌లో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

'శ్రీధర్‌బాబుపై ఆరోపణలు సరికాదు'

మంథని, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపణలు చేయడం సరికాదని వైసీసీ నేత ఆర్ల నాగరాజు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మంత్రి శ్రీధర్‌బాబు తనను చిన్నచూపు చూస్తున్నాడని ఎంపీ వంశీ మాట్లాడటం అవివేకం అన్నారు. శ్రీధర్‌బాబు చిన్నచూపు చూస్తే ఎన్నికల్లో వంశీ గెలిచేవాడా అని ప్రశ్నించారు. కొరవేన కృష్ణవంశీ, బూడిద రమేష్, ఆర్ల నిఖిల్‌లు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఎలిగేడు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పిరితోట గ్రామంలో బుధవారం శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం కన్నులపండువగా జరిగింది. ప్రతియేటా మే నెలలో స్వామివారి దేవాలయంను సుందరంగా తీర్చిదిద్ది వారం రోజులపాటు హోమాలు, వేదపండితులచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సుల్తానాబాద్, జూలపల్లి, పెద్దపల్లి, చొప్పదండి మండలాల నుంచి భక్తులు రథోత్సవంను తిలకించేందుకు వస్తుంటారు. రామిడి వెంకట్‌రామిరెడ్డి, రామిడి కొండాల్‌రెడ్డి, రామిడి సుదర్శన్‌రెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలి

పెద్దపల్లి టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): రైల్వే హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వందల కోట్ల రూపాయలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయాన్ని సమకూరుస్తున్న హమాలీ కార్మికులకు గుర్తింపుకార్డులు, ఇన్సూరెన్స్, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ లాంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో పాలకవర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన అన్నారు. మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించామని, ఈ సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. జంగ సంపత్, డైరెక్టర్స్ సీహెచ్ మోహన్, శ్రీశైలం, వెంకటేష్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని, మే 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్లను బుధవారం సీపీ కార్యాలయంలో సీపీ అంబర్‌కిశోర్ ఝా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబ్ మేళాలో 100కంపెనీలు పాల్గొంటున్నాయని, 3వేలకుపైగా ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం, ఆర్‌జీ-1 కమ్యూనిటీహాల్‌లో ఈ మేళాను నిర్వహిస్తున్నామని, నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, మడత రమేష్, ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, రాఘవేంద్రరావు, వీరారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణాలు తొలగింపు

● నిర్వాసితుల ప్రత్యామ్నాయానికి హామీ ● అభ్యంతరం తెలిపిన బీఆర్ఎస్ నాయకులు


జేసీబీతో నిర్మాణాల తొలగింపు


తొలగించిన నిర్మాణాల వద్ద వ్యాపారులు

కోల్‌సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ నుంచి మున్సిపల్ జంక్షన్ వరకు రాజీవ్ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు మొదలు పెట్టారు. దీనిలో భాగంగా బస్టాండ్ కాలనీవైపు ఉన్న నిర్మాణాలను బుధవారం తొలగించారు. పలు షాపుల నిర్వాహకులు స్వచ్ఛందంగా నిర్మాణాలను తొలగించారు. వారికి ప్రత్యామ్నాయం చూపేందుకు హామీ ఇవ్వడంతో నిర్మాణదారులు సహకరించారు. బస్టాండ్ వద్ద ఉన్న భవనం తొలగింపు విషయంలో వివాదం నెలకొన్నది. తమకు కోర్టు ఉత్తర్వులు ఉన్నాయంటూ భవన యజమాని నిరాకరించారు. బీఆర్ఎస్ నాయకులు కోరుకంటి చందర్, అభిషేక్‌రావు తదితరులు నిర్మాణాలు తొలగించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. నిరంకుశంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. ఒక్క భవనాన్ని మినహా మిగతా నిర్మాణాలను తొలగించారు. నిర్వాసితులైన వారికి వెనుక వైపు సింగరేణి స్థలం కేటాయించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

బాధ్యతల స్వీకరణ

భగత్‌నగర్, మే 14(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్)గా బుధవారం పి.మల్లేశం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వర్‌రావు అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లారు. మియాపూర్‌లో అసిస్టెంట్ పర్సనల్ మేనేజర్‌గా పనిచేస్తు పదోన్నతిపై కరీంనగర్ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా మల్లేశం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కరీంనగర్ డిపో మేనేజర్లు విజయ మాధురి, శ్రీనివాస్, పర్సనల్ ఆఫీసర్ జి.సత్యనారాయణ, జి.రవి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటి రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం రీజినల్ మేనేజర్ బి.రాజుకు పుష్పగుచ్ఛం అందజేశారు.

క్రీడాకారిణికి అభినందన

కరీంనగర్ స్పోర్ట్స్, మే 14 (ఆంధ్రజ్యోతి): డెహ్రాడూన్‌లో నిర్వహించిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన సిరిచందనను కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. బుధవారం కరీంనగర్ కార్యాలయంలో ఆమె కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



సెక్టార్-3 సింగరేణి స్కూల్‌లో సీబీఎస్ఈ అడ్మిషన్లు

యైటింక్లయిన్‌కాలనీ, మే 14(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సీబీఎస్ఈ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్టు పాఠశాల కరస్పాండెంట్ అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. నర్సరీ నుంచి తొమ్మిదవ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, అడ్మిషన్లు కావాల్సిన వారు దరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోపు పాఠశాలలో సమర్పించాలని సూచించారు. అడ్మిషన్ల ప్రక్రియ స్ర్కీనింగ్ టెస్ట్ ద్వారా మాత్రమే జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల వారు ప్రిన్సిపాల్‌ను సంప్రదించి అడ్మిషన్లకు సంబంధించి పూర్తి వివరాలను తెలుసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్


ధర్మారం అడ్డరోడ్డులో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్

పాలకుర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో బస్టాండ్లు కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో ప్రయాణీకులు ఎండలో, వానలో బస్సుల రాక కోసం పడిగాపులు కాస్తున్నారు. గోదావరిఖని నుంచి ధర్మారం అడ్డరోడ్డు టూ రచ్చపల్లి ధర్మారం మీదుగా బస్సులు రాకపోకలను కొనసాగిస్తుంటాయి. మండల పరిధిలో కస్తూర్బా బాలికల పాఠశాల ఉంది. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న బాలబాలికలు పై చదువుల కోసం పెద్దపల్లి, ధర్మారం, కరీంనగర్, గోదావరిఖని లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్తుంటారు. విద్యార్థులతో పాటు ప్రయాణీకులు బస్‌షెల్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బసంత్‌నగర్‌లో నాటి కేశోరాం సిమెంటు కంపెనీ ప్రయాణీకుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బస్ సెల్టర్‌లో పలువురు తమ తమ ద్విచక్ర వాహనాలను నిలుపడంతో పాటు, ధర్మారం అడ్డరోడ్డులో నిర్మించిన బస్ షెల్టర్‌లో ఓ వ్యక్తి పండ్ల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు. దీంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి బస్ షెల్టర్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

18న మెగా జాబ్ మేళా

● ఆర్జీ-3 జీఎం : సుధాకర్‌రావు

రామగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): మెగా జాబ్‌మేళా నిరుద్యోగ యువతకు సువర్ణ అవకాశమని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. బుధవారం జీఎం కార్యాలయం వివిధ గనులు, విభాగాధిపతులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెద్దపల్లి, మంచిర్యాలకు సంబంధించిన నిరుద్యోగ యువతీ, యువకులకు కోసం సింగరేణి సంస్థ రామగుండం రీజియన్ ఏరియాల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాను గోదావరిఖని పట్టణంలోని జవహర్‌లాల్ నేహ్రూ స్టేడియంలో ఈ నెల 18న చేపట్టనున్నాట్లు పేర్కొన్నారు. 7వ తరగతి నుంచి గ్రాడ్యుయేట్ విద్యార్హత కల్గిన అభ్యర్థులు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరా లోపు వారై ఉండాలని సూచించారు.

ఆసక్తి గల అభ్యర్థులు ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో తమ దరఖా స్తులు చేసుకొవాలని తెలిపారు. సుమా రు వంద పైగా కంపెనీలు పాల్గొని సుమారు మూడు వేలకు పైగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్జీ-3 ఏరియాలో ఈ వారంలో ప్రారంభించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని అందుకు తగిన ఏర్పాట్లను చేపట్టాలని సమీక్ష సమావేశంలో సూచించారు.

ఈ సమావేశంలో అధికారులు శేఖర్ బాబు, శ్రీనివాసులు, సత్యనారా యణ, రాజశే ఖర్, రాజారెడ్డి, చంద్రశే ఖర్, సుదర్శనం, కళ్యాణ్, సుజిత్, షబ్బీరుద్దీన్, రాజేశ్వరి, గుర్రంశ్రీహరి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం దిగివచ్చేలా ఐక్యత చాటుదాం

యైటింక్లయిన్‌కాలనీ, మే 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేలా మే 20న జరగనున్న సమ్మెను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో నాయకులు మాట్లాడారు. 1886 నుంచి వేలాది మంది కార్మికులు పోరాటాల వలన సురక్షితమైన చట్టాలను సాధించుకున్నట్టు తెలిపారు. ఎన్‌డీఏ ప్రభుత్వం 2018లో 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా సవరిస్తూ బిల్లుకు ఆమోదం తెలిపిందని, కార్మికులు ఆ చట్టాన్ని వ్యతిరేకిస్తుండటంతో దాన్ని అమలు చేయకుండా కేంద్రం వెనకడుగు వేస్తోందని అన్నారు. కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసే కార్మికులను ఇబ్బందుల పాలుజేసే ఈ చట్టాలకు వ్యతిరేకంగా మే 20న జరగనున్న ఒకరోజు టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. నాలుగు కోడ్‌లు అమలులోకి వస్తే దేశ కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు అందరూ సమిష్టిగా సమ్మెను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ గేట్‌మీటింగ్‌లో ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరివి రాజ్‌కుమార్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాజారెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్, నాయకులు జిగురు రవీందర్, మల్లేష్, అయిలి శ్రీనివాస్, రామ్మూర్తి, కుంట ప్రవీణ్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.


ఓసీపీ-3లో నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

రెండోసారి ఓసీపీ-1 ప్రాజెక్టుకు ఫైవ్ స్టార్ రేటింగ్

యైటింక్లైన్‌కాలనీ, మే 14(ఆంధ్ర జ్యోతి): ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1 ప్రాజెక్టు స్టార్ రేటింగ్‌ను సాధించింది. కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ దేశంలోని బొగ్గు, లిగ్నైట్ గనుల పనితీరు, స్వీయ మూల్యాంకన చేయడాన్ని పరిగణలోకి తీసుకుని గనులకు రేటింగ్ ఇస్తున్నది. 2019 సంవత్సరం నుంచి రేటింగ్ ఇస్తుండగా వరుసగా రెండవ ఏడాది ఓసీపీ-1 ఫైవ్‌స్టార్ సాధించింది. 2023- 24 సంవత్సరానికి కోల్‌మినిస్ట్రీ ఉత్తమ గనుల్లో సింగరేణి నుంచి ఓసీపీ-1కు ఫైవ్‌స్టార్ రేటింగ్ ప్రకటించింది. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో ఓసీపీ-1 ప్రాజెక్టు 92 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. గత ఏడాది 91 పాయింట్లతో ఫైవ్‌స్టార్ సాధించడం గమనార్హం. గని కార్యకలాపాలు, పర్యావరణం, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక పనితీరు, ఆర్‌అండ్‌ఆర్, ఉద్యోగి సంక్షేమం, రక్షణ, ఉద్యోగ భద్రత వంటి ప్రమాణాలతో ఉత్తమ పనితీరు సాధించింది. ఫైవ్‌స్టార్ రేంటింగ్ సాధించడం పట్ల ప్రాజెక్టు అధికారి జింగిటి రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించడంలో కృషి చేసిన అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మిక సంఘాలు, ఉద్యోగుల సమష్టి కృషి ఉన్నదని ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పీఓ రాజశేఖర్ పేర్కొన్నారు.

సీఎంపీఎఫ్ పెన్షన్ నిలిపివేత

గోదావరిఖని, మే 14(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తూ పదవీవిరమణ పొందిన 5,058 మంది లైఫ్ సర్టిఫికెట్లు అందించని కారణంగా సీఎంపీఎఫ్ అధికారులు పెన్షన్‌ను నిలిపివేశారని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి వేణు మాధవ్ తెలిపారు. సింగరేణిలో పని చేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులు, మృతి చెందిన వారి డిపెండెంట్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించకపోవడంతో అధికారులు పెన్షన్ నిలిపివేశారని తెలిపారు.


జీఎంకు సమ్మె నోటీసు అందిస్తున్న ఆకుల వెంకన్న

సార్వత్రిక సమ్మె నోటీసు అందజేత

రామగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నాల్గు లేబర్ కోడ్‌ల రద్దును నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టబోయే సార్వత్రిక సమ్మెపై ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఏపిఏ జీఎం నాగేశ్వర్‌రావు, ప్రాజెక్టు అధికారులు రాజశేఖర్, వెంకటరమణ, ఎస్ఎంఎస్ ప్లాంట్ మేనేజర్ సర్వనందు, పర్సనల్ మేనేజర్ సుదర్శన్‌లకు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న బుధవారం సమ్మెనోటీసులను వేర్వేరుగా అందజేశారు. అనంతరం లేబర్‌కోడ్‌ల రద్దుకు నిరసిన చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, రవి, రాజు, అశోక్, సింగర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐబీ కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి భూమి పూజ


ఐబీ కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్ మే 14 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి రోడ్డు విస్తరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న ఆర్‌అండ్‌బీ గదులను కూల్చివేసి వాటి స్థానంలో కొత్తగా గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే విజయరమణారావు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఐబీ చౌరస్తా నుంచి గట్టుపెల్లి రోడ్డు వరకు నూతన రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఈ నేపథ్యంలో వాణిజ్య సముదాయ గదులను కూల్చివేసి వాటి వెనుక భాగంలో కొత్తగా గదులను నిర్మిస్తున్నామన్నారు. మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ నియాజ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, శ్రీగిరి శ్రీనివాస్, గాజుల లక్ష్మీ రాజమల్లు, పన్నాల రాములు తదితరులు పాల్గొన్నారు.